క్లుప్తంగా

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు



రోడ్డు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని ఎస్.బూర్జివలస నుంచి బూరిపేట వెళ్లే రోడ్డు గోతులతో అధ్వానంగా తయారవడం వల్ల రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంతో ఎస్.బూర్జివలసకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ ప్రతినిధి పైల గణపతి తన సొంత నిధులతో సోమవారం రోడ్డు మరమ్మతులు చేయించారు. జేసీబీతో రోడ్డుపై గోతుల్లోని మట్టిని పూర్తిగా తీయించి, మెటల్ చిప్స్, క్రసర్ బుగ్గి తెప్పించి గోతులను పూడ్పించారు. గోతులను పూడచ్చడంపై వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తూ, పనులు చేయించిన గణపతిని అభినందించారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు వితరణ



తలగాంలో విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందిస్తున్న ఉపాధ్యాయులు

వంగర: మండలంలోని తలగాం, రాజులగుమ్మడ ప్రాథమిక పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులకు రాజాంకు చెందిన పారిశ్రామికవేత్త సీమకుర్తి ప్రసాదరావు భోజనం ప్లేట్లు వితరణ చేశారు. వీటిని సోమవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సీహెచ్.అప్పన్నదొర, టి.శ్రీధర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. దాతకు హెచ్‌ఎంలు, ఉపాధ్యా యులు జయరాజు, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కొంచాడ శ్రీనివా సరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌గా ఉన్న ఈయన సోమవారం ఎఫ్‌ఏసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించనున్నామని తెలిపారు. ఈయనకి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


ఘన స్వాగతం



డాక్టర్ కాశీనాయుడును స్వాగతిస్తున్న అభిమానులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొత్స కాశీనాయుడు, బొబ్బిలి మాజీ ఎంపీపీ బొత్స రమాదేవి యూరప్ దేశాల పర్యటనను ముగించుకుని స్వదేశానికి వచ్చిన సందర్భంగా అభిమానులు వారికి సోమవారం ఘన స్వాగతం పలికారు. విశాఖ ఎయిర్ పోర్టు నుంచి విజయనగరం, బొబ్బిలి, బలిజిపేట ప్రాంతాల్లో కాశీనాయుడు దంపతులకు స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో కొల్లి రామినాయుడు, తుట్ట నిరంజన్, కొల్లి రామకృష్ణ, ఎస్ గౌరీ.ప్రసాద్ రాయి రవి, పిన్నింటి శ్రీను,మహేష్, ఉమ, కొల్లి రామకృష్ణ తదితరులున్నారు.

ఘనంగా గౌరీ పౌర్ణమి వేడుకలు



డోలపేటలో పూజలు చేస్తున్న మహిళలు

రాజాం: పట్టణంలోని పలువార్డుల్లో సోమవారం గౌరీపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గౌరమ్మతో పాటు నందన్న దేవుడు ప్రతిమలను ఇళ్లకు తీసుకొచ్చి పూజలు చేశారు. డోలపేటలో జరిగిన ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నా రు. మండలంలోని పలు గ్రామాల్లోనూ ప్రజలు ఈ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

కందిపప్పు కట్..!



- రేషన్ లబ్ధిదారులకు అందని కందిపప్పు
- టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ డిపోల్లో నిలిచిన పంపిణీ
- ఈనెల, మళ్లీ నెల అంటూ వాయిదా
- పండగ నెలల్లో కూడా పంపిణీ చేయని వైనం

రాజాం: ఎన్నికల ముందు కూటమి నేతల కూతలు చూస్తే అబ్బో అన్నట్లు అనిపించింది. ఏదో చేసేస్తారని ఓట్లు వేసిన ప్రజలకు ఇప్పుడు కూటమి ప్రభుత్వ తీరు నిద్రపట్టనీయడంలేదు. సామాన్యుడి బతుకు కష్టంగా మారుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతీ నెల సంక్షేమ పథకాలు అమలుచేయడంతో పాటు ప్రతీ ఇంటికి ఏదో ఒక రూపేనా ఆర్థికంగా లబ్ధి కనిపించేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నగదు సంక్షేమ పథకాలు పూర్తిగా అటకెక్కాయి. వీటిని పక్కన పెడితే ఎప్పటినుంచో అమలులో ఉన్న నిద్యావసర సరుకుల పంపిణీ విధానం పూర్తిగా కనుమరుగవుతున్నట్లు కనిపిస్తోంది.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ లబ్ధిదారులకు ఇంటివద్దే బియ్యం, పంచదార, కందిపప్పు అందేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రేషన్ సరుకుల్లో కందిపప్పుకు కోత వేసింది. పంచదారను అరకొరగా అందిస్తోంది. పంచదార ధర బయట మార్కెట్‌కు రేషన్ షాపుల వద్ద పెద్దగా తేడా లేదు. కందిపప్పు ధర మాత్రం బయట కొండెక్కి కూర్చుంది. ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా తక్కువ ధరకు పంపిణీ చేసే కందిపప్పును వినియోగించుకుందామనుకునే పేదవాడి ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు జల్లింది.రేషన్ డిపోల్లో కందిపప్పు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురౌతున్నారు.



రాజాం మండలంలోని ఓ డిపోలో రేషన్ పంపిణీ(ఫైల్)

జిల్లాలో 5.81 లక్షల మంది లబ్ధిదారులు

జిల్లా వ్యాప్తంగా 5 లక్షల 81 వేల 212 మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి 1,244 రేషన్ డిపోల ద్వారా సరుకులు అందిస్తున్నారు. ప్రతీ నెల జిల్లాలోని లబ్ధిదారులకు 9085 టన్నుల బియ్యం, 306 టన్నుల పంచదార, 574 టన్నుల కందిపప్పు అవసరం ఉంటుంది. గత 15 నెలలుగా కందిపప్పు రేషన్ షాపుల్లోకి రావడంలేదు. రేషన్ డిపోల్లో గతంలో కందిపప్పును కిలో రూ.68 చొప్పున ఇచ్చేవారు. బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర ప్రస్తుతం రూ.140 నుంచి రూ.180 పలుకుతోంది. పేద ప్రజలు ఈ కందిపప్పును కొనలేని, తినలేని పరిస్థితి కనిపిస్తోంది. రేషన్ డిపోల్లో కందిపప్పు కోత అలానే కొనసాగుతోంది. ఈనెల, మళ్లీ నెల అంటూ కాలంనెట్టుకొస్తున్న ప్రభుత్వం కందిపప్పును పూర్తిగా కట్‌చేసింది.

సరఫరా కాలేదు

కందిపప్పు సివిల్ సప్‌లై గోదాములకు సరఫరా కాలేదు. అందుకే రేషన్ డిపోలకు రావడంలేదు. ప్రభుత్వం నుంచి గోదాములకు వస్తే అన్ని రేషన్ డిపోలకు సరఫరా చేసి, రేషన్ లబ్ధిదారులకు అందిస్తాం.

– ఏనుగుల అనంతకుమార్, సీఎస్‌డీటీ, రాజాం

బియ్యం మాత్రమే ఇస్తున్నారు



రేషన్ డిపోలో బియ్యం మాత్రమే ఇస్తున్నారు. గతంలో కందిపప్పు ఇచ్చే వారు. ఇప్పుడు ఒక్క నెల కూడా కందిపప్పు ఇవ్వలేదు. భవిష్యత్‌లో ఈ బియ్యం కూడా ఇస్తారో ఆపేస్తారో తెలియడం లేదు.

– ఎం.వెంకటనారాయణమ్మ, రంగారాయపురం, సంతకవిటి మండలం

నిత్యావసర సరుకులన్నీ ఇవ్వాలి



బయట నిత్యవసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. రేషన్ డిపోల ద్వారా బియ్యం మాత్రమే కాకుండా గతంలో మాదిరిగా కందిపప్పు, వంట నూనె, రాగిపిండి వంటివి రాయితీపై ఇప్పించాలి. నెల నెలా కందిపప్పు ఇప్పించే ఏర్పాటు చేయాలి.

– నవిరిగాన దమయంతి, వన్నలి, రేగిడి మండలం

ఆదాయ వనరులను సమకూర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

బొబ్బిలిరూరల్: ప్రభుత్వం అందిస్తోన్న నిధులతో పాటు పంచాయతీలు సొంతంగా ఆదాయాలను సమకూ ర్చుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీపీ శంబంగి లక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓఎస్ఆర్(ఓన్ సోర్స్ రెవెన్యూ)పై మండలంలోని సర్పంచ్‌లు,పంచాయతీ కార్యదర్శులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులను ఎంపీపీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్ద పంచాయతీల్లోని గ్రామాల్లో ప్రజల వాణిజ్య అవసరాలను గుర్తించి పంచాయతీ స్థలాల్లో షాపుల నిర్మాణం చేపట్టి వాటిని అద్దెకు ఇవ్వాలని, ఆదాయం సమకూర్చుకునేందుకు ఇలా ఇతర మార్గాలను అన్వేషించాలని చెప్పారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేసినప్పుడే మంచి ఫలితా లొస్తాయని అన్నారు. ఉమ్మడి ప్రణాళికల ద్వారా ఆదాయాన్ని పెంపొందించడం సులువవుతుందని వివరించా రు. అనంతరం ప్రణాళికల తయారీపై శిక్షకులు శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అల్లుభాస్కరరావు, తదిత రులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించండి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి

బొబ్బిలిరూరల్: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని ఐసీడీఎస్ పీఓ జె.విజయలక్ష్మి సూచించారు.మండలంలోని అలజంగి గ్రామంలో సోమవారం పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం ఆవశ్యకత, చిన్నారుల సంరక్షణపై అవగాహన కల్పించారు. మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, అంగన్‌వాడీ సిబ్బంది వారికి పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా, ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేస్తున్నారా లేదా అని పర్యవేక్షించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మావతి,మహిళా పోలీసులు,వైద్యసిబ్బంది,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

రేగిడి: మండలంలోని ఖండ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్'పై సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్, సచివాలయ కార్యదర్శి పోలినాయుడు, హెచ్‌ఎం నాగభూషణ దొర తదితరుల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఉపాధిహామీ టీఏ సత్తిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను చెల్లింపులకు అవకాశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రత్నం

రామభద్రపురం: ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్ ద్వారా ఇంటి పన్ను,ఆస్తి పన్ను చెల్లించుకునే విధంగా వెసులుబాటు కల్పించాలమని ఎంపీడీఓ రత్నం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమ య్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక నుంచి ఇంటి యజమానులు ఆన్‌లైన్ ద్వారా ఇంటి పన్ను చెల్లించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించాలన్నారు. ప్రభుత్వం స్వర్ణ పంచాయతీల పేరిట గ్రామాల్లో ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందుబాటు లోకి తెచ్చిందన్నారు. పంచాయతీల్లో అన్ని వివరాలను డిజిటలైజ్ చేశారన్నారు. ఇప్పటి వరకు పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి గ్రామ సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డిమాండ్ నోటీసులు పంపిణీ చేసేవారని, ఇకపై ఇంటి యజమానుల ఫోన్లకే ఆ నోటీసు వస్తుందని తెలిపారు. నోటీసు ఆధారంగా పోర్టల్‌లోకి వెళ్లి పన్ను చెల్లించుకోవచ్చన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ సన్యాసరావు,డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరమణ,ఎంఈఓ తిరుమల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు రోడ్డెక్కడానికి ప్రభుత్వమే కారణం



విజయవాడ బయలుదేరిన ఉపాధ్యాయులకు వీడ్కోలు పలుకుతున్న ఫ్యాప్టోనేతలు

రామభద్రపురం: ఉపాధ్యాయులు రోడ్డు మీదకు వచ్చి ధర్నాలు చేయడానికి కారణం టీడీపీ కూటమి ప్రభుత్వమేనని ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు జె.సి.రాజు విమర్శించారు.ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో పోరుబాటలో భాగంగా ఈనెల 7వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ధర్నాకు మండలం నుంచి పలువురు ఉపాధ్యాయులు సోమవారం బయలుదేరారు. వీరికి ఫ్యాప్టో నేతలు వీడ్కోలు పలికి సాగనంపారు. ఈసందర్భంగా జె.సి.రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని టీడీపీ కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా హామీలు అమలు కాలేదని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫ్యాప్టో నాయకులు బి.రవికుమార్, శర్మ, కృష్ణంనాయుడు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీలక్ష్మణరావు,జెడ్పీటీసీ సరస్వతి

రామభద్రపురం: ఇటీవల ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షాలకు ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు,జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి డిమాండ్ చేశారు.స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు వేల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడిపెట్టి, ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయన్నారు. మండలంలో కూర గాయల పంటల సాగుపై అధిక శాతం రైతులు ఆధారపడి బతుకుతున్నారన్నారు. మండలంలో సుమారు 350 ఎకరాలపైబడి చిక్కుడు, కాలీఫ్లవర్, వంగ,బెండ,దొండ, పచ్చిమిర్చి,ఉల్లి తదితర పంటలతో పాటు ఆకుకూరలు పండిస్తున్నారని చెప్పారు. ఈ పంటలు 80 శాతం వరకు దెబ్బతినడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చేతికందిన పంటలు అమ్ముకుని అప్పులు తీర్చుకుందామ నుకుంటే వర్షాల కారణంగా కనీసం పెట్టుబడి కూడా రాకుండా పోయిందని రైతులు బాధపడుతున్నారని అన్నారు. పంటలను పరిశీలించి పాడైన పంటలకు నష్టపరిహారం అందిచాలని కోరుతూ కలెక్టర్‌తో పాటు ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులకు లేఖలు రాయనున్నామని చెప్పారు. బాధిత రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాదరావు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు కోసం ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

రాజాం సిటీ: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో ఈఎస్ఐ సేవలు అందక వేలమంది ఉద్యోగులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని కార్మిక సంఘాల నాయకుడుసీహెచ్.రామ్మూర్తి నాయుడు ఆరోపించారు. రాజాంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద కార్మికులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాంలో ఈఎస్ఐ డిస్పెన్సరీని ప్రైవేటు ఆస్పత్రులకు టైఅప్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనేక పోరా టాల పలితంగా 2003లో రాజాం ప్రాంతానికి ఈఎస్ఐ ప్యానల్ క్లినిక్‌ను సాధించుకున్నామని అన్నారు. తర్వాత కాలంలో కార్మిక, ఉద్యోగుల సంఖ్య పెరిగినప్పటికీ డిస్పెన్సరీ హాస్పిటల్ ఏర్పాటు చేయకుండా ఈఎస్ఐ కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమ ర్పించినా స్పందించక పోవడం దారుణమన్నారు. అలాగే కార్మికులకు ఏ చిన్న ఆరోగ్యసమస్య వచ్చినా వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖపట్నంలోని ఈఎస్ఐ ఆస్ప త్రికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈఎస్ఐ కార్పొరేషన్‌లో వేల కోట్ల రూపాయలు మూలుగుతున్నా కార్మికులకు ఖర్చు పెట్టేందుకు చేతులు రాకపోవడం దుర దృష్టమని అన్నారు. కార్మిక సంఘాల నాయకులు అనిల్‌కుమార్, శ్రీనివాసరావు, సత్యారావు, శంకరరావు,లక్ష్మి, సావిత్రమ్మ, రాజేశ్వరి, గురువులు, బాలరాజు, వైకుంఠ, వాసు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'వరల్డ్ స్పేస్ వీక్'

బొబ్బిలి: ఈనెల 8 నుంచి 10 వరకు స్థానిక రాజా కళాశాలలో 'వరల్డ్ స్పేస్ వీక్' నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.వీరేంద్ర కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐక్యరాజ్య సమితి సూచనల ప్రకారం ఏటా అక్టోబర్ నెలలో వరల్డ్ స్పేస్ వీక్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు శ్రీహరి కోట సతీష్ ధావన్ స్పేష్ సెంటర్ భాగస్వామ్యం తీసుకుందని, ఇది విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల ఉత్సవమని వివరించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని విద్యార్థులకు విజ్ఞాన,సాంకేతిక శాస్త్రాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. క్విజ్,డ్రాయింగ్, సైన్స్‌ఫెయిర్,పోస్టర్ ప్రెజెంటేషన్,ఇస్రో శాస్త్రవేత్తలతో చర్చలుంటాయని, ఈ ఉత్సవాల్లో విద్యార్థులు పాలుపంచుకోవాలని కోరారు.

ఉపకార వేతనాలకు ఎంపిక



విద్యార్థినులతో వసుధైక కుటుంబం ఫౌండేషన్ ప్రతినిధి రమేష్

బాడంగి: మండలంలోని గజరాయునివలస ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు బెంగళూరుకు చెందిన వసుధైక కుటుంబం ఫౌండేషన్ అందజేసే ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ఉపాధ్యాయులు సోమ వారం తెలిపారు. తల్లిదండ్రులు లేని, అనాథ విద్యార్థినుల విద్యాభివృద్ధికి వసుధైక కుటుంబం సహకారం అందిస్తోందని ఆ ఫౌండేషన్ ప్రతినిధి రమేష్ చెప్పారు. గజరాయునివలస పాఠశాలలో ఉత్తమ ప్రతిభకనబరుస్తున్న ఇద్దరి విద్యార్థినులను ఉపకార వేతనాలకు ఎంపిక చేశామని, వీరికి నెలకు రూ.వెయ్యి చొప్పున అయిదేళ్లపాటు అందిస్తామని పేర్కొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం

రేగిడి: రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఐ.కృష్ణలత అన్నారు. మండ లంలోని చాటాయివలసలో రీసర్వేపై సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా తహ సీల్దార్ మాట్లాడుతూ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోయినా, రికార్డుల్లో నమోదు కాకపోయినా ఈరీసర్వే ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. సర్వే చేసేందుకు సిబ్బంది వచ్చేటప్పుడు రైతులు తమ వన్‌బీ, ఆధార్‌కార్డు తీసుకువెళితే మీ భూమి సరిగా ఉందాలేదా చూసి చెబుతారని చెప్పారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన

రాజాం సిటీ: రాజాంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లకు 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్'పై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌ఐఓ శివ్వాల తవిటినాయుడు సోమవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గుదలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందనే విషయాన్ని విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. అలాగే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషిచేయాలని కోరారు. బాలుర, బాలికల కళాశాలల ప్రిన్సిపాళ్లు డి.రామారావు, కె.జనార్ధనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర పురస్కారం



మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌లకు అవార్డు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

బొబ్బిలి: తడి, పొడి చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణలో 50వేల నుంచి లక్ష వరకు జనాభా గల పట్టణాల్లో బొబ్బిలి మున్సిపాలిటీ మొదటి స్థానంలో నిలిచి స్వచ్ఛాంధ్ర అవార్డు దక్కించుకుంది. సోమవారం అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ అవార్డు అందుకున్నారు.

విజయనగరం ఉత్సవాల్లో ఉత్తమ ప్రదర్శన



ధ్రువపత్రాలు అందుకుంటున్న కోన రవి బృందం

బొబ్బిలి: పెడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా నిర్వహించిన విజయనగరం ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో బొబ్బిలి పట్టణానికి చెందిన కళాకారులకు ప్రశంసలు దక్కాయి. పాత బొబ్బిలికి చెందిన మింది విజయమోహనరావు 'నేను ఒక నటుడిని' అనే ఏకపాత్రాభినయం ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఈయనకి అక్కడి సాంస్కృతిక కార్యక్రమాల కన్వీనర్, ఎస్‌డీసీ ఈ.మురళీ, జిల్లా ప్రభుత్వ అధికారులు మెమెంటో, ప్రశంసా పత్రం, నగదు బహుమతి అందజేశారు.అలాగే పట్టణానికి చెందిన ఆమ్రపాలి సంగీత,నృత్య కళాసమితి అధ్యక్షుడు కోన రవి మూడు బృందాలతో ఇచ్చిన జానపదం, కూచిపూడి, భాగవత నృత్యాల ప్రదర్శనలు ఉత్తమంగా నిలిచాయి. ఆయా బృందాలను చీపురుపల్లి ఆర్డీఓ ఆశయ్య, ఏపీఎంబీపీ పీడీ పి.వి.లక్ష్మీనారాయణ సత్కరించి జ్ఞాపికలు,ధ్రువపత్రాలు అందజేశారు.



విజయమోహనరావును సత్కరిస్తున్న అధికారులు